

## జూబ్లీహిల్స్‌లో నేత్రపర్వంగా రాములోరి కల్యాణం

**హాజరైన ఖైరతాబాద్ మాజీ శాసనసభ్యుడు చింతల రామచంద్రారెడ్డి**

**ప్రజానావ, హైదరాబాద్:** జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్, స్వామి వివేకానంద నగర్, దుర్గా భవాని నగర్, గౌతమ్ నగర్ చౌరస్తా, మాగంటి కాలనీ ప్రాంతాల్లో శ్రీరామ నవమి సందర్భంగా శుక్రవారం సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఖైరతాబాద్ మాజీ శాసనసభ్యుడు చింతల రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీరాముడి ఆదర్శాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని, సమాజంలో ధర్మం, ఐక్యత పెంపొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకటస్వామి, జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు వల్లెపు శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల గణేశ్ యాదవ్, జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు గందె అరుణ్ కుమార్, ఖైరతాబాద్ నియోజకవర్గం బీజేవైఎం కో-కన్వీనర్ దండగుల శేఖర్ పాల్గొన్నారు. అలాగే స్వామి వివేకానంద నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంతు ముదిరాజు, డివిజన్ ప్రధాన కార్యదర్శి గుంటి ఆనంద్ సాగర్, ఉపాధ్యక్షుడు వలిశెట్టి రాంబాబు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మక్కల నరేశ్, బీజేవైఎం అధ్యక్షుడు మంజలి నరసింహ, మహిళా మోర్చా అధ్యక్షురాలు గొల్లి రమ్య, సోషల్ మీడియా కన్వీనర్ వరికుప్పల మహేశ్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి మోహన్, నాయకులు రోహిత్, సీనియర్ నాయకులు మల్లికార్జున్ గౌడ్, వుట్ల శశిశేఖర్, తాళ్ల తిరుపతి హాజరయ్యారు. పోలింగ్ బూత్ అధ్యక్షుడు ఎం. రాజు, వల్లెపు హనుమంతు, ఎన్. రాజు, శ్రీకాంత్, భీమేశ్ యాదవ్ సహా యువకులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా భక్తులకు పానకం, ప్రసాదం పంపిణీ చేశారు.



## తార్నాకలో వైభవంగా సీతారాముల కల్యాణం

**హాజరైన నగర మాజీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి**

**ప్రజానావ, హైదరాబాద్:** పవిత్రమైన శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం గ్రేటర్ హైదరాబాద్ నగరంలోని తార్నాక డివిజన్‌లో నిర్వహించిన సీతారామ కల్యాణ మహోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమాల్లో నగర మాజీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డి కూడా హాజరై భక్తులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. శ్రీరామ నవమి పండుగ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహత్తర ఆధ్యాత్మిక వేడుక అని తెలిపారు. శ్రీరాముడు ఆచరణలో ధర్మాన్ని పాటించిన ఆదర్శ పురుషుడని, ఆయన జీవితం సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ శ్రీరాముడి ఆదర్శాలను అనుసరించి సమాజంలో సౌహార్దం, శాంతి, సదాచారం పెంపొందించేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం స్థానిక ప్రజలతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, భక్తులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీరాముని ఆశీస్సులు పొందారు.



## భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి వేడుకలు



**ప్రజానావ, ఖైరతాబాద్:** శ్రీరామనవమి సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, బస్తీల నాయకుల పిలుపుమేరకు 18 బస్తీల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీతారామచంద్రస్వామి కల్యాణం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగ్ రావు, గుంటి నగేశ్, సాగర్, ఆకుల రాజు, ఆవుల రాజన్న, ఆర్.ఎల్లయ్య, జే. శ్రీనివాస్, ఎం. శ్రీనివాస్, అర్జున్, శ్రీను, ముత్యాల శ్రీనివాస్ నాయుడు, కిరణ్, రామకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, వీరేష్, గండికోట శంకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎంఆర్‌సీ కాలనీ, దుర్గ భవాని నగర్, వినాయక నగర్, బండారు బాల్ రెడ్డి నగర్ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై సీతారామచంద్రస్వామి కల్యాణంలో పాల్గొని స్వామి వారి ఆశీర్వాదం పొందారు.

# కమనీయం..రమణీయం

- కనుల పండువగా సీతారాముల కల్యాణం
- రామ నామస్మరణతో మార్మోగిన ఇల్లందకుంట
- ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజానావ, జమ్మికుంట:** ఉత్తర తెలంగాణలో అతి ప్రాచుర్యమైన ఇల్లందకుంట సీతారామచంద్ర స్వామి ఆలయంలో రాములోరి కల్యాణం కమనీయంగా జరిగింది. ఆలయ వేద పండితులు వంశీధరాచార్యుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణల మధ్య ఎదుర్కోళ్ల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణం సందర్భంగా ప్రభుత్వం తరఫున స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ చిత్ర మిశ్రా, సీపీ గౌస్





ఆలం, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ బాబు అందజేశారు. కల్యాణ మండపంలో వేలాది మంది భక్తుల రామనామ స్మరణతో ఆ ప్రాంగణమంతా మార్మోగింది. 12 .22 నిమిషాలకు జిలకర బెల్లం పెట్టగా, 12.31 గంటలకు సీతమ్మవారికి పూజారులు మేళ తాళాల మధ్య మాంగల్య ధారణ చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం భక్తులకు ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. కల్యాణానికి వచ్చిన భక్తులకు జమ్మికుంట రైస్, కాటన్ మిల్లర్లు 50 వేల మందికి పైగా ఉచిత అన్నదానం చేశారు. అదేవిధంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆదేశాల మేరకు ఆలయ ప్రాంగణంలో మజ్జిగను పంపిణీ చేశారు. కరీంనగర్ సీపీ ఆదేశాల మేరకు హుజూరాబాద్ ఏసీపీ మాధవి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, ఆర్డీవో రమేశ్ బాబు గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశ్, ఇల్లందుకుంట ఆలయ చైర్మెన్ ఇంగిలి రామారావు, డైరెక్టర్లు, హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, జమ్మికుంట చైర్మన్ ప్రశాంత్ కుమార్‌తో పాటు నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# కల్యాణోత్సవంలో అడుగడుగునా వైఫల్యాలే

- పోలీసుల ఆంక్షలతో ఇబ్బందుల పాలైన భక్తులు
- ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి
- కొట్టొచ్చిన పాలక మండలి నిర్లక్ష్యం

**ప్రజానావ, జమ్మికుంట:** ఇల్లందకుంట సీతారాముల కల్యాణోత్సవంలో అధికారులు, పాలక మండలి వైఫల్యాలతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం నిర్వహించిన శ్రీ సీతారామ కల్యాణోత్సవానికి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అశేషంగా తరలివచ్చారు. అయితే గతానికి భిన్నంగా ఈసారి జాతర ఏర్పాట్లలో డొల్లతనం కనిపించింది. సుదూర ప్రాంతాల నుంచి కల్యాణోత్సవాన్ని తిలకించడానికి వచ్చిన భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించలేదు. కల్యాణోత్సవ ప్రాంగణంలో గాలి లేక భక్తులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. కనీసం తాగునీరు కల్పించలేదు. ఫలితంగా భక్తులు అరిగోసపడ్డారు. వీఐపీ, డోనర్, మీడియా పాస్‌లను విచ్చలవిడిగా పంపిణీ చేయడంతో కల్యాణ వేదిక గందరగోళంగా మారింది. వీవీఐపీలతో వచ్చిన అనుచరులతో కల్యాణ ప్రాంగణం రసాభాసగా మారింది. అంతా నాయకుల దృష్టిలో పడేందుకు గుంపులు గుంపులుగా వేదిక ముందు తిరగడంతో కల్యాణ ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు నోచుకోలేని దుస్థితి ఎదురైంది. పాలక మండలి సైతం కల్యాణ వేదిక వద్ద జనం దృష్టిలో పడడానికి పరిమితమయ్యారు తప్ప భక్తుల పరిస్థితిని సమీక్షించే నాథుడే లేకుండా పోయారనే విమర్శలు బహిరంగంగా వినిపించాయి.

**వీఐపీల సేవలకే పరిమితం**

పోలీసులు ప్రవేశ ద్వారాలు, వీఐపీల సేవలకే పరిమితమయ్యారని భక్తులు చర్చించుకోవడం వినిపించింది. కల్యాణోత్సవంలో సేవల పేరిట వచ్చిన పలు స్వచ్ఛంద సంస్థలు, వివిధ శాఖల సిబ్బంది అందించిన సేవలు ఏమిటో అర్థం కాలేదు. విధుల పేరిట ఎక్కడి వారు అక్కడే కుర్చీలు వేసుకుని కల్యాణాన్ని వీక్షించారే తప్ప భక్తుల గోస గాలికి వదిలేశారనే భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇబ్బడిముబ్బడిగా జారీ చేసిన పాస్‌లతో పాటు పలువురి సిఫారసులతో వచ్చిన వారితో భక్తులు అసహనానికి గురయ్యారు. ఏర్పాట్లలో పాలకమండలి డొల్లతనం, అంతర్గత కుమ్ములాటలు, సమన్వయ లోపం, కొట్టొచ్చినట్టు కనిపించింది. ప్రతి ఏటా కల్యాణోత్సవం సందర్భంగా భోజన వసతి కల్పించే మిల్లర్లకు



ఆలయ అధికారులు, పాలకవర్గం తమకేమీ పట్టనట్టు.. అది మిల్లర్ల బాధ్యత అన్నట్టుగా వ్యవహరించడం వారిని కొంత నైరాశ్యానికి గురిచేసింది. భోజన ఏర్పాట్లతో సహా వండటం, వడ్డించడం బాధ్యత అంతా మిల్లర్లదే అన్నట్టుగా మారింది. ఆలయం తరపున పాలక వర్గం, ఆలయ అధికారుల సహకారం కొరవడడం మిల్లర్లను నిరాశ పరిచింది. ఆలయ ప్రాశస్త్యంకు తగ్గట్టుగా అధికారులు ఏర్పాట్లు చేయకపోవడం భక్తులను వేదనకు గురిచేసింది. జర్నలిస్టులకు ఇచ్చిన మీడియా పాస్‌లను పోలీసులు పట్టించుకోకపోవడంతో పాత్రికేయులు అసహనానికి గురయ్యారు. పోలీస్ శాఖ ఇచ్చిన పాస్‌లను పోలీసులే అనుమతించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి.







# గ్యాస్ సిలిండర్లకు కొరతలేదు

## ప్రజల అవసరాలకు అనుగుణంగా నిలువలు ఉన్నాయి

### కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజానావ, సిరిసిల్ల :** జిల్లాలో గ్యాస్ సిలిండర్లకు కొరత లేదని కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా జిల్లాలో సిలిండర్ల నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి అపోహలు పడవద్దని, వదంతులు నమ్మవద్దని సూచించారు. గృహ వినియోగదారులు తొందరపడి గ్యాస్ బుక్ చేసుకోవద్దని తెలిపారు. తమ అవసరాలకు అనుగుణంగా గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. గ్యాస్ సిలిండర్ పక్కదారి పట్టినా.. బ్లాక్ దందా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎల్‌పీజీ గ్యాస్ సరఫరా విషయమై జిల్లాలో కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్‌కు సంబంధించిన సమస్యలు ఎదురైతే వినియోగదారులు 80084 29738 ఫోన్ నంబర్‌కు సంప్రదించి తమ ఫిర్యాదులను తెలియ జేయవచ్చని పేర్కొన్నారు. ఎల్‌పీజీ గ్యాస్ సరఫరా, పంపిణీకి సంబంధించిన సమస్యలను పర్యవేక్షించడంతోపాటు వినియోగదారుల ఫిర్యాదులను స్వీకరించి, పరిష్కరించే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కంట్రోల్ రూమ్‌లో నమోదు అయ్యే ఫిర్యాదులను సంబంధిత అధికారులు, ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీలకు తెలియజేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు.

# నేడు సిరిసిల్లలో కేంద్ర మంత్రి పర్యటన

**ప్రజానావ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శనివారం పర్యటిస్తున్నారు. తంగళ్ళపల్లి మండలం అంకిరెడ్డి పల్లెలో ఉదయం 10:30 గంటలకు అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహిస్తారు. తర్వాత ముస్తాబాద్ మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తారని భారతీయ జనతా పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి వెల్లడించారు.

# ఇల్లంతకుంట మండలం కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా విజయకుమార్



**ప్రజానావ, సిరిసిల్ల :** కాంగ్రెస్ పార్టీ ఇల్లంతకుంట మండల ఎస్సీ సెల్ అధ్యక్షులుగా బిగుల్ల విజయకుమార్ నియామకం అయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు అకునూరి బాలరాజు చేతుల మీదుగా ఇల్లంతకుంట మండల అధ్యక్షునిగా బిగుల్ల విజయకుమార్ ని నియమిస్తూ లేఖను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట మండలంలోని ప్రజా ప్రతినిధులు, సర్పంచ్ మడికాడి లావణ్య రవి, మాజీ ఎంపిటిసి యాసా తిరుపతి, ఫ్యాక్స్ మాజీ డైరెక్టర్ జంగిటి కొమరయ్య, నల్గొండ శంకర్, బిగుల్ల కృష్ణ, బిగుల్లఅశోక్ , దోమాటి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# మహాదేవుని అవతారం అంటూ మహిళపై అత్యాచారం

## వసాయికి చెందిన నకిలీ బాబా రిషికేష్ వైద్యపై కేసు

**ప్రజానావ, ముంబై:** “నేను మహాదేవుని అవతారం” అంటూ ఒక మహిళను మోసం చేసి అత్యాచారం చేసిన ఘటనలో వసాయికి చెందిన స్వయం ప్రకటిత బాబా రిషికేష్ వైద్యపై కేసు నమోదైంది. ఈ ఘటనపై 35 ఏళ్ల మహిళ ఫిర్యాదు చేయగా, వసాయిలోని మాణిక్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. తదుపరి దర్యాప్తు కోసం కేసును పూణేలోని హడప్సర్ పోలీసులకు బదిలీ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం... పూణేలో నివసిస్తున్న బాధితురాలు ఫేస్‌బుక్ ద్వారా రిషికేష్ వైద్యను పరిచయం చేసుకుంది. ‘ఆమ్చి వసాయ్’ సంస్థ అధిపతిగా చెప్పుకున్న అతను, ఆధ్యాత్మికత బోధిస్తానని నమ్మబలికి ఆమెను సంప్రదించాడు. 2023 డిసెంబర్‌లో పూణేకు వెళ్లిన నిందితుడు, “నేను మహాదేవుని అవతారం... నువ్వు పార్వతివి” అంటూ ఆమెను మోసగించాడు. అనంతరం మంజరి ప్రాంతంలోని ఒక లాడ్జికి తీసుకెళ్లి, నీటిలో మత్తుమందు (గంజాయి కలిపిన ద్రావకం) ఇచ్చి ఆమెపై అత్యాచారం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈ సమయంలో ఆమెకు తెలియకుండా అసభ్యకరమైన ఫోటోలు, వీడియోలు తీసిన నిందితుడు, వాటిని చూపిస్తూ బాధితురాలిని బ్లాక్‌మెయిల్ చేశాడు. వసాయికి వచ్చినప్పుడు తనను కలవాలని ఒత్తిడి తెచ్చినట్లు తెలుస్తోంది. 2025 మే నెలలో వసాయిలోని ఓ హోటల్‌లో ఆమెపై మరోసారి అత్యాచారానికి యత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల నాసిక్‌కు చెందిన అశోక్ ఖరత్ కేసు వెలుగులోకి రావడంతో బాధితురాలికి ధైర్యం వచ్చి, జరిగిన విషయాన్ని తన భర్తకు తెలిపింది. అనంతరం బుధవారం సాయంత్రం మాణిక్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.





# రాజన్న క్షేత్రంలో రాములోరి కల్యాణం

- శివార్చన మండపం వద్ద కళ్యాణ వేడుక
- భారీ సంఖ్యలో హాజరైన భక్తజనం
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు.. ప్రభుత్వ విప్ ఆది
- రాజన్న అంత:రాలయంలో ఏకాంతంగా కల్యాణ తంతు
- అట్టహాసంగా రథోత్సవం





**ప్రజానావ, వేములవాడ :** హరిహర క్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శ్రీ రామనవమి ఉత్సవాలు శుక్రవారం కన్నుల పండుగగా జరిగాయి. రాజన్న ఆలయ ప్రార్కింగ్ స్థలంలోని శివార్చన మండపం వద్ద శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు సీతారాముల వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ముందుగా భీమన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మంత్రి వెంట ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమా అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతె, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు. రాజన్న అభివృద్ధిలో భాగంగా ప్రధాన ఆలయంలోని సితారామ ఆలయంలో అర్చకులు ఏకాంత పూజలు నిర్వహించారు. అంత:రాలయంలో సీతారాముల కళ్యాణం నిర్వహించినట్లు ఆలయ ఈవో రమాదేవి తెలిపారు. అనంతరం ఉత్సవమూర్తులను పార్కింగ్ స్థలంలోని శివార్చన మండపం వద్ద ఏర్పాటు చేసిన కళ్యాణ వేదిక వద్దకు పల్లకిలో ఊరేగింపుగా తీసుకువచ్చారు.

### సీతారాముల కల్యాణ

వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని సీతారాముల పల్లకి మోశారు. మున్సిపల్ ఆధ్వర్యంలో ఛైర్మన్ పుల్కం రాజు, వైస్ ఛైర్మన్ నరాల శేఖర్ పాలకవర్గ సభ్యులతో కలిసి విప్ పట్టువస్త్రాలను సమర్పించారు. సీతా రాముల కళ్యాణ వేడుకలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ఈ మహోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. సీతారాముల కల్యాణ సమయంలో పలువురు భక్తులతో పాటు జోగినిలు, ట్రాన్స్‌జెండర్లు సైతం ఒకరికొకరు తలంబ్రాలు పోసుకుని దేవుడుని వివాహం చేసుకున్నట్లుగా భావించారు. రాజన్న సన్నిధిలో సీతారాముల కళ్యాణ వేడుకల్లో భాగంగా సాయంత్రం స్వామి వార్ల రథోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. ఎస్పీ మహేష్ బి గీతె ఆధ్వర్యంలో భారీ



పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.







# విద్యానగర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో..


## ఘనంగా శ్రీ సీతారాముల కళ్యాణోత్సవంలి

## రామరాజ్యంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి

## వేడుకల్లో ముఖ్య అతిథి మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి

**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల పట్టణం విద్యానగర్ శ్రీఅభయాంజనేయ స్వామి దేవాలయం లో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి దంపతులు పాల్గొన్నారు. సీతారాముల కళ్యాణం ఉత్సవ వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణం లో లోక రక్షకుడైన శ్రీరామనామ స్మరణలతో ఆలయ ప్రాంగణం మార మోగింది. ఈ సందర్భంగా చైర్ పర్సన్ జిందం కళ మాట్లాడుతూ సీతారామచంద్రమూర్తుల దీవెనలతో ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండాలని, ప్రజలు పాడిపంటలు, వృత్తి వ్యాపార రంగాలలో అభివృద్ధి చెందాలని, రామరాజ్యం లో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఆ సీతారామచంద్ర మూర్తులను ఈ సందర్భంగా ప్రార్థించినట్టు తెలిపారు. కళ్యాణ మహోత్సవం విద్యానగర్ అభయాంజనేయ స్వామి దేవాలయంలలో కన్నుల పండగ గా నిర్వహించడం అందులో తాము కూడ పాల్గొనడం సంతోషాన్ని కలిగించిందని అన్నారు. ఆ సీతారామచంద్రమూర్తుల కళ్యాణం ఎంతో వైభవంగా, శాస్త్రీయతంగా హిందూ సాంప్రదాయం లో పెళ్లి ప్రాముఖ్యతని తెలియజేసేలా చక్కగా కన్నుల పండగ సీతారామ కళ్యాణ మహోత్సవలను నిర్వహిస్తున్నందుకు శ్రీ భక్తాంజనేయ దేవాలయ అభివృద్ధి కమిటీ వారికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆ సీతారామచంద్ర మూర్తిల వివాహ మహోత్సవంను పురస్కరించుకొని దేవాలయాలలో అన్నదానం యొక్క గొప్పతనాన్ని తెలియజేసేలా మహా అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలు విజయవంతముగా నిర్వహించడంలో భాగస్వామ్యులైన ప్రతి ఒక్కరికి మా ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నామని జంగం కళాచక్రపాణి పేర్కొన్నారు.







# ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు నిరంతరం నిఘా

## మూడు నెలల్లో 45 కేసులు నమోదు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

## జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

**ప్రజానావ, సిరిసిల్ల :** జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టే దిశగా పోలీసు యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టి నిఘాను కఠినతరం చేసి నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ మహేశ్ బి. గితే తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇసుక త్రవ్వకాలు, రవాణా చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వచ్చేనెల ఒకటో తేదీ నుంచి మన ఇసుక వాహనం ద్వారా ఇసుక సరఫరా చేయాలని, అక్రమంగా ఇసుక రవాణా చేసిన, నిల్వలు ఉంచిన వారిపైనా కేసులు నమోదు చేసి, సంబంధిత వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందన్నారు. గడిచిన మూడు నెలల వ్యవధిలో జిల్లాలో అక్రమ ఇసుక రవాణాపై వరుస దాడులు నిర్వహించి మొత్తం 45 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇకపై కూడా అక్రమ ఇసుక రవాణాపై ఎలాంటి సడలింపు లేకుండా కఠినంగా వ్యవహరించాలని పోలీస్ స్టేషన్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఇసుక అక్రమ రవాణా లేదా అక్రమ నిల్వలపై ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు.

# పోలీస్ కుమార్తె ఘాతుకం..

## ప్రేమకు అడ్డుగా నిలిచిన తండ్రికి విషం

## మూడేళ్ల తర్వాత వెలుగులోకి నిజాలు

### చంద్రాపూర్‌లో సంచలనం రేపిన హత్య కేసు నిజాలు వెలుగులోకి



**ప్రజానావ, ముంబై:** ప్రేమ వ్యవహారాన్ని వ్యతిరేకించిన తండ్రిని కుమార్తె తన ప్రియుడి సహాయంతో విషమిచ్చి హత్య చేసిన సంచలన ఘటన నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసులో నిందితులైన కానిస్టేబుల్ ఆశిష్ మహేష్ షెడ్మాకే (30), అతని ప్రియురాలు, మృతుడి కుమార్తె కానిస్టేబుల్ ఆర్య జయంత్ బల్లవార్ (22), చైతన్య సచిన్ గెడం (22) ను అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం... ఆశిష్, ఆర్య మధ్య సుమారు 13 ఏళ్లుగా ప్రేమ సంబంధం కొనసాగుతోంది. అయితే ఈ సంబంధాన్ని జయంత్ బల్లవార్ తీవ్రంగా వ్యతిరేకించడంతో, ఆర్య తన ప్రియుడు ఆశిష్‌తో కలిసి తండ్రిని హత్య చేయాలని కుట్ర పన్నింది. ఏప్రిల్ 25, 2023న జయంత్ బల్లవార్ విధి నిర్వహణలో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో కుప్పకూలి మరణించాడు. ఆ సమయంలో మరణానికి గల కారణం స్పష్టంగా తెలియలేదు. తాజాగా, ఆశిష్ షెడ్మాకే పోలీసుల ముందు నేరాన్ని అంగీకరించడంతో అసలు విషయం బయటపడింది. ఆర్య తన తండ్రికి మిల్క్‌షేక్‌లో విషం కలిపి ఇచ్చినట్లు విచారణలో వెల్లడైంది. ఆ మిల్క్‌షేక్ తాగిన అనంతరం జయంత్ బల్లవార్ డ్యూటీకి వెళ్లి అక్కడే కుప్పకూలి మృతి చెందాడు. ఈ ఘటన కోసం ఆర్య తన మామ చైతన్య గెడం నుంచి రూ.5వేలు ఇచ్చి విషం తెప్పించినట్లు పోలీసులు తెలిపారు. తండ్రి మరణం తర్వాత ఆర్య, ఆశిష్ వివాహం చేసుకున్నప్పటికీ, తర్వాత వారి మధ్య విభేదాలు తలెత్తాయి. పోలీసు శిక్షణ సమయంలో అసభ్య ప్రవర్తన కారణంగా ఆశిష్ షెడ్మాకేను సర్వీసు నుంచి తొలగించారు. అనంతరం భార్యతో తలెత్తిన వివాదాల నేపథ్యంలో ఈ మొత్తం విషయాన్ని అతడు బయటపెట్టాడు. దీంతో రామ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి ఆశిష్, ఆర్య, చైతన్య గెడం సహా విషం సరఫరా చేసిన మరో నిందితున్ని అరెస్టు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# సిరిసిల్లలో వైభవంగా శ్రీ సీతారామాంజనేయ రథోత్సవం

- జైశ్రీరామ్ నినాదాల మధ్య పురవీధుల్లో సాగిన రథయాత్ర ఊరేగింపు
- వార్డుల్లో ఉత్సవ ఉత్సవ మూర్తులను మూర్తులను దర్శనం చేసుకున్న భక్తులు, మహిళలు



**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల పట్టణంలో శ్రీరామ నవమి ఉత్సవాలలో భాగంగా వైభవంగా రథోత్సవం జరిగింది. శుక్రవారం స్థానిక నెహ్రూనగర్ శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల రథోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ నగర్, సుభాష్ నగర్ తదితర వీధులలో వేలాదిమంది భక్తుల మధ్య రత యాత్ర సాగింది. మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి ముఖ్యఅతిథిగా పాల్గొని రథోత్సవ ఊరేగింపు కార్యక్రమం ను ప్రారంభించారు. రథయాత్ర ఊరేగింపులో బారులు తీరి భక్తులు మహిళలు సీతారామాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. రంగ రంగ వైభవంగా రథయాత్ర వీధుల్లో హర్షద్వానాల మధ్య జై శ్రీరామ్ నినాదాలు తో కొనసాగింది. ఈ సందర్భంగా పురపాలక సంఘం అధ్యక్షురాలు జిందం కళ చక్రపాణి మాట్లాడుతూ లోకానికి ఆదర్శ దంపతులైన శ్రీ సీతారాముల దంపతుల కళ్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని స్థానిక నెహ్రు నగర్ శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయం ఆధ్వర్యంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఘనంగా నిర్వహించి ఉత్సవ దేవత విగ్రహాలతో ఘనంగా పురవీధుల గుండా ఊరేగిస్తూ నిర్వహిస్తున్న రథోత్సవ కార్యక్రమాన్ని చూడ్డానికి రెండు కళ్ళు సరిపోవటం లేదని, ఈ రథోత్సవంలో ప్రతి ఒక్కరి మదిలో శ్రీ సీతారాముల వారిని స్మరించుకుంటూ పలుకుతున్న రామనామ స్మరణతో పరిసరాలన్నీ మారుమోగుతూ ఒక కొత్త ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడిందని అన్నారు. భక్తుల కోరిన కోరికలు తీర్చే దేవుడిగా నిత్యం ప్రజలచే పూజనందుకుంటున్నారు శ్రీ సీతారామాంజనేయుల చల్లని దీవెనలతో ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఆనందంగా జీవించాలని ప్రజలందరూ వారి వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి చెంది సంతోషంగా ఉండేలా చూడాల్సిందిగా శ్రీ సీతారామాంజనేయ స్వామి వారి ఈ సందర్భంగా కోరుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్ లు దూడం రజిని శ్రీనివాస్, ఎర్రం వెంకట రాజం, బొద్దుల శ్రీనివాస, మేర్గుమంజుల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ గుండ్లపల్లి రామానుజం, తాటిపాముల దామోదర్, సిరిసిల్ల పట్టణం పద్మశాలి సంఘం అధ్యక్షులు దూడం శంకర్, పద్మశాలి కళ్యాణ భవన అధ్యక్షులు గుండ్లపల్లి శ్రీనివాస్, గుండ్లపల్లి గౌతం, పుర ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సిరిసిల్లలో కేటీఆర్ సుడిగాలి పర్యటన

## పలు రాములవారి కళ్యాణాల వేడుకల్లో పూజలు

## ఘన స్వాగతం పలికిన వేద పండితులు

## బీఅర్ఎస్ నేతల శుభాకార్యాలకు హాజరు



**ప్రజానావ, సిరిసిల్ల :** భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు శుక్రవారం సిరిసిల్ల నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని పలు దేవాలయాలను సందర్శించి రాముల వారి కళ్యాణాన్ని తిలకించారు. అలాగే పలు శుభ కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. సిరిసిల్లలో కేటీఆర్ సుడిగాలి పర్యటన చేశారు. శ్రీరామనవమి పురస్కరించుకొని తొలుత ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామంలో శ్రీ సీతారాముల కళ్యాణాన్ని కనులారా తిలకించారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చిన్న బోనాల గ్రామంలో జరుగుతున్న శ్రీ సీతారాముల కళ్యాణానికి హాజరయ్యారు. వేద పండితులు కేటీఆర్ కు ఘనస్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుండి సిరిసిల్ల పట్టణం హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద గల శ్రీ రామాలయం వద్ద జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణానికి హాజరయ్యారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కేటీఆర్ కు ఘనస్వాతం పలికారు. సీతారామచంద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడినుండి వెంకంపేట హనుమాన్ దేవాలయం లో జరిగిన రాములవారి కళ్యాణానికి హాజరయ్యారు. తర్వాత ఇటీవలే ఘనవిజయం సాధించిన 36వ వార్డు బీఅర్ఎస్ కౌన్సిలర్ కల్లూరి రేణుక రాజు గృహాన్ని సందర్శించారు. అలాగే 39 వ వార్డు బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ కార్యాలయాన్ని కేటీఆర్ ప్రారంభించి కుటుంబ సభ్యులతో కాసేపు ముచ్చటించారు. అక్కడి నుండి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మంచే శ్రీనివాస్ మనువడి నామకరణానికి హాజరయ్యారు. చివరగా ఇటీవలే అకాల మరణం పొందిన మున్నూరు కాపు సంఘం గౌరవ అధ్యక్షులు కామినేని నీలిశంకర్ కుటుంబాన్ని కేటీఆర్ పరామర్శించారు. ఈ కార్యక్రమాలలో టెస్కాబ్ మాజీ చైర్మన్ కొండూరు రవీందర్రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చీటీ నర్సింగరావు, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి, వైస్ చైర్మన్ దార్ల సందీప్, పట్టణం బీఆర్ఎస్ అధ్యక్షులు జిందం చక్రపాణి, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ గుడ్ల మంజుల బాలకిషన్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



# దొంగతనం అనుమానంతో కుమార్తెలపై అమానుషం

- తలకిందులుగా వేలాడదీసిన వైనం
- ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- మహారాష్ట్రలోని అట్పాడి తాలూకాలో ఘటన
- బంధువులతో కలిసి రహస్య అంత్యక్రియల యత్నం





**ప్రజానావ, ముంబై:** మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లా అట్పాడి తాలూకాలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. దొంగతనం చేశారన్న అనుమానంతో ఓ వ్యక్తి తన సొంత ఇద్దరు కు మార్తెలను రాత్రంతా తలకిందులుగా వేలాడదీసిన దారుణం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో 10 ఏళ్ల బాలిక సానికా మృతి చెందగా, మరో బాలిక అనుజ పరి స్థితి విషమంగా ఉంది. పోలీసుల వివరాల ప్రకారం... అట్పాడి తాలూకాలోని బన్‌పురి గ్రామానికి చెందిన నానా హైబత్ యమ్‌గర్ అనే వ్యక్తి, తన కుమార్తెలు సానికా, అనుజలు పొరుగువారి ఇంట్లో దొంగతనం చేశారన్న అనుమానంతో బుధవారం రాత్రి సుమారు 8 గంటలకు వారిని ఇంట్లోనే తలకిందులుగా వేలాడదీశాడు. ఆ చిన్నారులు రాత్రంతా నొప్పితో విలవిల్లాడుతూ నీళ్లు అడిగినా, తల్లిదండ్రులు ఏ మాత్రం కనికరం చూపలేదు. ఆ బాలికల తాతయ్య, నా నమ్మ ఇంటి బయట నిద్రపోతుండగా, ఉదయం సమయంలో వారిని కిందకు దించేందుకు ప్రయత్నించాడు. అయితే నిందితుడు ఇనుప రాడ్‌తో అతనిపై దాడి చేయడానికి యత్నించాడు. అనంతరం బాలికల దగ్గరకు వెళ్లి చూడగా, ఇద్దరూ స్పృహ కోల్పోయి ఉన్నారని గుర్తించాడు. వెంటనే వారిని కిందకు దించి సమీప ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, సానికా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనను దాచిపెట్టేందుకు నిందితులు సానికా మృతదేహాన్ని ఇంటికి తీసుకువెళ్లి, బంధువులతో కలిసి రహస్యంగా అంత్యక్రియలు నిర్వహించేందుకు ప్రయత్నించారు. అయితే గాయాలతో చికిత్స పొందుతున్న అనుజకు స్పృహ రావడంతో జరిగిన దారుణాన్ని వైద్యులకు వివరించింది. దీంతో వైద్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# పాఠశాలల పేర్లలో తోకలను తీసేయండి

## మోసపూరిత స్కూళ్లపై మహారాష్ట్ర విద్యాశాఖ చర్యలు

**ప్రజానావ, ముంబై:** పలు పాఠశాలలు తమ పేర్లలో ‘గ్లోబల్’, ‘ఇంటర్నేషనల్’, ‘సీబీఎస్ఈ’ వంటి పదాలను ఉపయోగిస్తూ తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తున్న నేపథ్యంలో మహారాష్ట్ర విద్యాశాఖ కఠిన చర్యలు చేపట్టింది. ఫిబ్రవరి 6, 2026న విద్యాశాఖ డైరెక్టరేట్ జారీ చేసిన ఉత్తర్వుల అమలు మార్చి నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైంది. అర్హత లేని పాఠశాలల పేర్ల నుంచి ఈ పదాలను తక్షణమే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యాశాఖ కొత్త నిబంధనల ప్రకారం, ‘సీబీఎస్ఈ’ అనే పదాన్ని కేవలం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ అనుమతి పొందిన పాఠశాలలే ఉపయోగించాలి. అదే విధంగా ‘ఇంటర్నేషనల్’ లేదా ‘గ్లోబల్’ అనే పదాలను ఉపయోగించాలంటే ఆ పాఠశాలకు విదేశాల్లో శాఖ లేదా అధికారిక అంతర్జాతీయ అనుబంధం ఉండటం తప్పనిసరి. ఇకపై కొత్త పాఠశాలల అనుమతులు లేదా ఉన్నతీకరణ కోసం ప్రతిపాదనలు సమర్పించినప్పుడు పాఠశాల పేర్లను కఠినంగా పరిశీలించనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ చర్యలతో విద్యారంగంలో పెరుగుతున్న వాణిజ్యీకరణను అరికట్టడం లక్ష్యంగా పెట్టుకున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించే ముందు ‘ఇంటర్నేషనల్’, ‘గ్లోబల్’ వంటి పేర్ల వెనుక ఉన్న ప్రభుత్వ అనుమతులను తప్పనిసరిగా పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ విషయంపై నాగ్‌పూర్‌కు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుల సంఘ ప్రతినిధి నిశాంత్ నారన్వారే మాట్లాడుతూ, విద్యాశాఖ తీసుకున్న ఈ నిర్ణయం సరైన దిశలో మొదటి అడుగని తెలిపారు. ఇకపై తల్లిదండ్రులను మోసం చేయడం ఆగాలని, విద్యారంగ వాణిజ్యీకరణకు అడ్డుకట్ట వేయాలని, విద్యార్థుల నమ్మకాన్ని పునరుద్ధరించాలని ఆయన అభిప్రాయపడ్డారు. విద్యా వ్యవస్థ సక్రమంగా కొనసాగాలంటే ఈ నిబంధనలను కఠినంగా అమలు చేయడం అవసరమని ఆయన సూచించారు.

